క్లుప్తంగా

కుటుంబానికి అండగా నిలబడదాం



తెనాలిటౌన్: వీడియో గ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు వెంకీ ఇటీవల మృతి చెందడం బాధకరవిషయమని అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దేవిచౌక్‌లోని ఆంధ్రాప్యారిస్ కిడ్స్ స్టూడియో నందు అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ వీడియోగ్రాఫర్ వెంకీ మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నూతన సభ్యత్వాల నమోదు, ఐడీ కార్డులు వంటి విషయాలపై చర్చించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ ఫొటోగ్రాఫర్ రాముకి ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో డ్రెయిన్లకు మరమ్మతులు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలోని డ్రెయిన్‌లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చెంచుపేట జరుగుతున్న ప్రధాన కాల్వ పూడికతీత పనులను మంగళవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని అనేక కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. దీని వలన మురుగు నీరు పారుదల సక్రమంగా జరగడంతో పాటు దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ యాతాటి అనిల్, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనాధలకు కాస్మోటిక్ వస్తువులు పంపిణీ



తెనాలిటౌన్: పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని తెనాలి వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వధార్ హోంలోని మానసికులు, అనాధలకు అవసరమైన కాస్మోటిక్, నిత్యావసర వస్తువులు పంపిణీ నిర్వహించారు. కొల్లి హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య సునీత ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. దాదాపు 55 మందికి సబ్బులు టూత్ పేస్టులు, ఆహారానికి సంబంధించిన వస్తువులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హృదయమేరి, సునీత, డెవలెప్‌మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాధుల తోటను శుభ్రం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని సమాధుల తోటను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పాండురంగపేటలోని సమాధుల తోటను మంగళవారం ఆయన పరిశీలించారు. సమాధుల మధ్య ఉన్న పిచ్చి చెట్లను తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టర్ రోజు క్రైస్తవులు తమ పూర్వీకులను స్మరించుకుంటారని తెలిపారు. వారికి ఎటువంటి ఆటంకం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

రీ సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ

దుగ్గిరాల: రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా మండలకేంద్రంలోని దుగ్గిరాల గ్రామంలో మండల అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మందుగా పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం కూడలి వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ ప్రజలు తమ గ్రామాలలో ప్రభుత్వం చేపట్టనున్న భూరీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'అభినవ గంధర్వ' ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

- తండ్రి ఏవీ సుబ్బారావు కళావారసుడు
- పౌరాణిక పద్యనాటకానికి అంకితమైన కళాకారుడు
- నాలుగున్నర దశాబ్దాల్లో నాలుగువేలకు పైగా ప్రదర్శనలు
- వందలాది సత్కారాలు, బిరుదులు, గౌరవాలు
- కందుకూరి వీరేశలింగం రాష్ట్ర అవార్డుకు ఎంపిక



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు



శ్రీకృష్ణుడు పాత్రలో...

తెనాలి: కళారంగంలో విశిష్ట కృషి చేసిన నాటకరంగ ప్రముఖులకు ప్రభుత్వం బహూకరించే కందుకూరి వీరేశలింగం రాష్ట్ర అవార్డుకు పట్టణానికి చెందిన ప్రముఖ పద్యనాటక కళాకారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం జయంతి రోజైన బుధవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసే అవార్డుల ప్రదానోత్సవంలో వెంకటేశ్వరరావును వీరేశలింగం అవార్డు, రూ.లక్ష నగదు, జ్ఞాపికతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా కళారంగ ప్రముఖుడు వెంకటేశ్వరరావు పరిచయం.

తన పద్యగానంతో పౌరాణిక నాటకరంగాన్ని ప్రకాశింపజేసిన ఆణిముత్యాల్లో తెనాలికి చెందిన 'అభినవ గంధర్వ' ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఒకరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలతో అర్ధ శతాబ్దంపాటు నాటక ప్రియులను అలరించిన 'గానకోకిల' ఏవీ సుబ్బారావు సుపుత్రుడు వెంకటేశ్వరరావు. డిగ్రీ చదివినా, తండ్రి కళా వారసత్వాన్ని అందుకున్నారు. ఏవీ సుబ్బారావు కళాప్రతిభతో ఒక వెలుగు వెలిగిన శ్రీపూర్ణశ్రీ నాట్య కళాసమితిని చేతబట్టి పద్యనాటకానికి అంకితమయ్యారు. తండ్రి తరహాలోనే శ్రీకృష్ణుడు పాత్రలో రాణించటమే కాకుండా వివిధ పౌరాణిక పాత్రల్లో తనదైన శైలితో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఆంధ్ర రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని తెలుగువారు సహా ఆయన పద్యగానంలోని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించారు.

'గానకోకిల' ఏవీ సుబ్బారావు పెద్దకుమారుడు వెంకటేశ్వరరావు. సొంతూరు తెనాలి సమీపంలోని కొల్లూరు మండల గ్రామం అనంతవరం. తండ్రితోపాటు తెనాలిలోనే స్థిరపడ్డారు. తండ్రి స్ఫూర్తితో హైస్కూలులోనే తొలి వేషం గట్టిన ఈ కళాకారుడు. బీకాం చదువయ్యాక 1979లో పద్య నాటకాన్నే తన కెరీర్‌గా చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అర్జునుడు, భవానీశంకరుడు, వేమారెడ్డి, నక్షత్రకుడు, బాలవర్థి, చంద్రుడు పాత్రల్లో ప్రతిభను చాటారు. 2023 వరకు 4,371 ప్రదర్శనలు ఇచ్చిన ఘనతను సాధించారు. చింతామణి నాటకంలో ప్రేమ సన్నివేశం, శ్రీకృష్ణ రాయబారంలో పడకసీను, సెంటర్‌సీను, గయోపాఖ్యానం నాటకంలో యుద్ధసీను, చింతామణి పూర్తినాటకం, భవానీశంకరుడు ఏకపాత్ర ఆడియో రికార్డులుగా విడుదలయ్యాయి. గయోపాఖ్యానంలో యుద్ధసీను వీడియో రికార్డుగా వచ్చింది.

పౌరాణిక పద్యనాటక కళాసేవకు గుర్తింపుగా 852 పైగా సత్కారాలను, గౌరవాలను స్వీకరించారు. 2007-08 నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు నంది అవార్డులు, బిరుదులను అందుకున్నారు. 1995లో 'తానా' ఆహ్వానంపై ఉత్తర అమెరికాలో అనేకచోట్ల నాటక ప్రదర్శనలిచ్చారు. గాయనీమణి పి.సుశీల చేతులమీదుగా బంగారు కంకణం, నెల్లూరులో బంగారు కిరీటం, అక్కినేని నాగేశ్వరరావు చేతులమీదుగా కె.రఘురామయ్య అవార్డు మరచిపోలేని అనుభూతులుగా వెంకటేశ్వరరావు చెబుతారు. నాటకం ప్రదర్శిస్తుండగా ప్రేక్షకుల నుంచి కానుకల రూపంలో వచ్చిన రూ.4 లక్షలతో ఒక నిధి ఏర్పాటుచేసి నెలకు ఐదుగురు చొప్పున పేద కళాకారులకు రూ.500 వంతున ఆర్థికసాయం అందజేస్తూ దాతృత్వాన్ని చాటుతున్నారు. అధ్యాపకుడిగా పనిచేస్తున్న వీరి కుమారుడు నాగరాజు రంగస్థల నటుడిగా రాణిస్తున్నారు. ఏవీ సుబ్బారావు వర్ధంతి రోజైన డిసెంబరు 16న వెంకటేశ్వరరావు, నాటకరంగంలోనే కొనసాగుతున్న ఆయన సోదరులు కోటేశ్వరరావు, ఆదినారాయణ ఏటా భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏవీ సుబ్బారావు పేరిట రాష్ట్రస్థాయి అవార్డును ప్రదానం చేయటమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా గల పలువురు కళాకారులను సత్కరిస్తున్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

తెనాలిటౌన్: ఈ నెల 17వ తేదీ గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి మంగళవారం తెలిపారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

తెనాలిటౌన్: నేటి నుంచి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ వై.వి.డి.ప్రసాద్ తెలిపారు. మండలంలో కఠెవరం, కోపల్లె, బుర్రిపాలెం, కొలకలూరు, తేలప్రోలు గ్రామాల్లో గ్రామసభలు ఉదయం10 గంటల నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. గ్రామ సర్పంచ్‌లతో పాటు మండలస్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను గ్రామసభల్లో అర్జీ ద్వారా తెలియజేయాలని సూచించారు.

19న ఫిరంగిపురంలో జాబ్‌మేళా

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ జేవియర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఈనెల 19న దివీస్ కంపెనీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ మణిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, బీటెక్, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ పాసైనవారు అర్హులన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. అదేరోజు అభ్యర్థుల ఎంపిక నిర్ణయించి తెలియజేస్తారన్నారు. దూరప్రాంతాలనుంచి వచ్చేవారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటతీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 784273 5467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మతోన్మాదం అరికట్టడానికి కృషి చేయాలి

క్రిష్టియన్ రైట్స్ అధ్యక్షులు జాన్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌బాబు

తెనాలిటౌన్: బ్యూలా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశపూరిత మంగళవారం రూరల్ మండలంలోని కఠెవరం గ్రామంలో నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మతసామరస్యం, ప్రజల మధ్య శాంతి, సోదర భావం వీరజిల్లాలని క్రైస్తవ పెద్దలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో క్రిష్టియన్ రైట్స్ అధ్యక్షులు జాన్‌బాబు పాల్గొని మాట్లాడారు. మతోన్మాదం ఏ మతంలో ఉన్నా, ఏ రూపంలో ఉన్న కూకటి వేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. కొందరూ వ్యక్తులు ఇప్పటికి బైబిల్‌పై బురదజల్లుతున్నారని ఆరోపించారు. క్రైస్తవ మతాన్ని దూషిస్తే ఊరుకోవద్దని అన్నారు. క్రైస్తవులపై దాడులు జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం వారుగాని, పోలీసు వారుగాని పక్షపాత ధోరణి లేకుండా ప్రజలందరికీ సమాన దృష్టితో చూడాలని కోరారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ సుధీర్‌కుమార్, రెవరెండ్ ప్రభుదాసు, రెవరెండ్ భానుప్రసాద్, పాస్టర్లు అబ్రహం, ఆనంద్ కుమార్, రమేష్, బాబురావు, పలువురు దైవసేవకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను ఆర్పే విధానాన్ని ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెనాలిరూరల్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని తెనాలి అగ్నిమాపక కార్యాలయ ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై తెనాలి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కాల్చి అజాగ్రత్తగా పడేయడం, గ్యాస్ లీకవడం వంటి కారణాలతో ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమందించాలని సూచించారు. ఆర్టీసీ డీఎం రాజశేఖర్, రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో విజ్ఞానం పెంపొందుతుంది



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మురళీకాంత్, గీతాకాంత్

తెనాలిఅర్బన్: విద్యను అభ్యసించడం వలన విజ్ఞానం పెంపొందుతుందని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బాలాజీరావుపేటలోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం యుపీ స్కూల్‌లో సోమవారం రాత్రి వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కులకు ప్రాధాన్యం ఇవ్వకుండా పిల్లల సామాగ్రాభివృద్ధికి ఉపయోగపడే కరికులంని బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ పాఠశాలలో టక్‌బుక్‌తో పాటు అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అగ్‌మెంటెడ్ రియాల్టీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి విద్యబోధన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరికి అలరించాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

మంగళగిరి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.నిరంజన్, కార్యదర్శి సందీప్, కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో వున్న ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో మంగళ వారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సెల్ నోడల్ ఆఫీసర్ శ్యామల, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంకు వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో పనిచేస్తున్న మాకు ఉన్న సమస్యలు చెప్పుకోవడానికి మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులను కలిశామని అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఉద్యోగ సవరణ జరగాలని కోరారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాల తరువాత రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశ ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, రాజీవ్, నంధ్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, అనంతరపురం జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్, ఇతర జిల్లాల అధ్యక్షులు పాలొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు మంగళవారం అందజేశారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన మద్దిరాల పార్వతికి రూ. 48,996లు, వెంకట రామనరేంద్రకు రూ.26,218 విలువైన చెక్కులను వారి నివాసాలకు వెళ్లి అందజేశామని తెలియజేశారు.

18న సంస్మరణ సభ

నిడమర్రు(మంగళగిరి): నాస్తికమేళా రూపశిల్పి చార్వాకాశ్రమ వ్యవస్థాపకులు చార్వాక రామకృష్ణ 18వ సంస్మరణ సభ ఈ నెల 18వ తేదీన నిడమర్రు చార్వాక ఆశ్రమంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతి తార్కిక భౌతికవాదంపై జరిగే చర్చలో రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్‌తో పాటు పలువురు వక్తలు, నాస్తిక సమాజం, పౌరహక్కుల సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా రెండు రోజులు పేకాట శిబిరాలపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం సోమవారం రూరల్ పరిధిలోని ఎయిమ్స్ రోడ్‌లో కొండపై పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 3070లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్ తెలిపారు. అదేవిధంగా మంగళవారం రూరల్ పరిధిలోని ఆత్మకూరు వడ్డెరపాలెంలో పేకాట శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ. 19500/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

క్లాప్ ఆటోడ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి



కమిషనర్ అలీమ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట గత 9 రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా క్లాప్ ఆటో డ్రైవర్లు సమ్మె చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. జీతాలు చెల్లించని పక్షంలో కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కనీస వేతనం నెలకు రూ. 24500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాకు కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, పట్టణ నాయకులు బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మంగళగిరి టౌన్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మంగళగిరి పట్టణ సీపీఎం నాయకులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచిందని, వెంటనే ఆ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచబోమని చెప్పి అధికారంలోకి రావడంతోనే విద్యుత్ చార్జీలు కోట్ల రూపాయల భారం విద్యుత్ వినియోగదారులపై వేశారని ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు, జిల్లా కార్యదర్శి నేతాజీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవి, పట్టణ కార్యదర్శి జవహర్ లాల్, నాయకులు చెంగయ్య, దుర్గారావు, భాగ్యరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

మంగళగిరి టౌన్: నేరాల నియంత్రణే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంగళగిరి సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని మెయిన్‌బజార్‌లో మంగళవారం విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం జరిగే నేరాలపై విజువల్ పోలీసింగ్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

'పీ-4' కుటుంబాలను విచారించిన అధికారులు

తాడికొండ: పీ-4 బంగారు కుటుంబం ఎంపికలో భాగంగా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు కలిసిన కుటుంబాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కలిశారు. తహసీల్దార్ మెహర్ కుమార్ ఆధ్వర్యంలో సంకూరు ప్రసన్న, సంకూరు నవీన్, బూర్ల చిన్నమ్మాయి, సరిగల నీలిమ తదితరుల ఇంటికెళ్లి కలిసిన రెవెన్యూ అధికారుల బృందం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా కుటుంబాలను విచారించి నివేదికను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు విచారించి వారి అవసరాలు గుర్తించి రూపొందించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ హనుమంతరావు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఎస్‌ఆర్‌ఎం ఉద్యోగుల క్రీడా పోటీలు

నీరుకొండ(మంగళగిరి): మండలంలోని నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరుగుతున్న ఉద్యోగుల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు సభలో విజేతలకు మెమొంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ నెల 1 వ తేదీన ప్రారంభమైన పోటీలలో ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొనడం అభినందనీయమని వీసీ మనోజ్ కుమార్ అరోరా కొనియాడారు. యూనివర్సిటీకి చెందిన మానవ వనరులు, స్పోర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రికెట్, త్రోబాల్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. యూనివర్సిటీకి చెందిన 340 మంది ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడలలో పాల్గొన్నారని తెలిపారు. క్రికెట్ పోటీలలో సీఎస్ఈ ప్రొఫెసర్స్ జట్టు విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఉదయరాజ్, బెస్ట్ బౌలర్‌గా హెచ్‌ఆర్ అన్వేష్, బెస్ట్ ఫీల్డర్‌గా డాక్టర్ రంజిత్ తాఫా, ఓవరల్ ఛాంపియన్‌షిప్ ఉదయరాజ్ దక్కించుకున్నారు. మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను వేదశ్రీ, మోని కైవసం చేసుకున్నారు.

త్రోబాల్ పోటీలలో అడ్మిన్ టీం విజేతగా నిలిచింది. క్యారమ్స్‌లో కె.శ్రీనివాసరావు, నవ్య కళలు, రోప్ స్కిప్పింగ్‌లో రేణుకబాబు, రత్నప్రభ, బ్యాడ్మింటన్‌లో ఉదయరాజులు విజేతలుగా నిలిచారు. విజేతలకు వీసీ మనోజ్ కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డీన్ డాక్టర్ సి.బామిలు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి, అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మిత, కోచ్ వంశీలు పర్యవేక్షించారు.

• ఫుట్‌ఫాత్ బిజినెస్!!



పట్టణంలోని మూడు వంతెనలపై ఉన్న ఫుట్‌పాత్‌లమీద ఇష్టారాజ్యాంగా చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్, గంగానమ్మపేట, మార్కెట్ వంతెనలపై ఉన్న ఫుట్‌పాత్‌ల మీద కూరగాయాలు, పండ్లు, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో ఈ మూడు వంతెనలపై ట్రాఫిక్ కిక్కిరిసిపోతుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారుల రద్దీ అధికంగా ఉంటుంది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడం వలన ట్రాఫిక్ రద్దీతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సిబ్బంది చిరువ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళ ఈ అమ్మకందారులు మైకులు పెట్టి అమ్మకాలు సాగిస్తు నానా ఇబ్బందీ పెడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వంతెనలపై వ్యాపారాలను కట్టడి చేసి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. -తెనాలిటౌన్

500 గ్రాముల గంజాయి పట్టివేత

మంగళగిరి రూరల్ పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పరిధిలో గంజాయి కలిగి వున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళగిరి కాజ టోల్‌గేటు వైపుగా కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు సమాచారం అందడంతో మంగళవారం టోల్‌గేటు వద్ద ఈగల్‌టీమ్ పోలీసులు పహారా కాశారు. మధ్యాహ్న సమయంలో కారులో వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈగల్‌టీమ్ అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా సుమారు 500 గ్రాములు గంజాయి ఉందని, ఆ గంజాయి కొత్తరకం హైడ్రో గంజాయి మాదకద్రవ్యంగా ఈగల్‌టీమ్ పోలీసులు అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కొత్తరకం గంజాయిని, మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయానికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. బెంగళూరు నుంచి విశాఖపట్నంకు తీసుకువెళుతున్నట్లు ఈగల్‌టీమ్ ప్రాథమిక విచారణలో తేలిందని, రూరల్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను విచారిస్తున్నట్లు తెలియవచ్చింది.